క్లుప్తంగా

భవన నిర్మాణానికి భూమిపూజ



మిడ్జిల్: పెద్దగుంట్ల తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ మంజులతో కలిసి ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాం సుందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలానికి చర్యలు

గండీడ్: వెన్నచేడ్‌లో ఉన్న గ్రంథాలయానికి సంబంధించి నాలుగు షాపులను అద్దెకు ఇవ్వడానికి వేలం వేయనున్నట్లు సర్పంచ్ పుల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనే వారు రూ. 30 వేలు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరిట డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఆయనను సంప్రదించాలని సూచించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



కోయిల్‌కొండ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేశ్వాపూర్, మల్కాపూర్, చందాపూర్ గ్రామాల పరిసరాలలో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటేందుకు యువకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రాజాపూర్: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు నర్సిములు జన్మదిన వేడుకల్లో పాల్గొని చీరలు పంపిణీచేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి



మహబూబ్‌నగర్ రూరల్: బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ -ఆర్‌ఆర్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజగాని అశోక్ అన్నారు. శుక్రవారం సుభాష్‌నగర్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లు ఏబీసీడీ వర్గీకరణ కోసం రెండు దశాబ్దాలుగా మాదిగలు, ఉప కులాలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వంద రోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు పెట్టి వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి మోసం చేసిందని అన్నారు. ఇప్పటికైనా మాటనిలుపుకోవాలన్నారు. అనంతరం 43వ వార్డు (సుభాష్‌నగర్) అధ్యక్షుడిగా ఐపీ వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏకే ధనుంజయలను నియమించారు. నాయకులు కె.తిరుమలయ్య, చెన్నయ్య, కె.వెంకటయ్య పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



జడ్చర్ల టౌన్: ఆషాఢమాసం పురస్కరించుకుని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని సొసైటీ నిర్వాహకురాలు బాలమణి పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టణంలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించి పూజలు చేశారు. కూరగాయలతో అమ్మవారిని అలంకరించి లలితాసహస్రనామ పారాయణం చేశారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



కోటకదిరలో బోనాలవేడుకలో పాల్గొన్న భక్తులు



ఎక్వాయపల్లిలో వేడుకలు



గాధిర్యాల్‌లో..

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోటకదిరలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు. సన్నాయి, బ్యాండ్ వాయిద్యాల మధ్య ఊరేగింపు సాగింది. వేడుకల్లో సర్పంచ్ మల్లు రమ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహమ్మదాబాద్ ఎల్లమ్మ, కంచన్‌పల్లి, గాధిర్యాల్ గ్రామాల్లో ఊరేగింపు చేపట్టారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మహమ్మదాబాద్ వేడులకు రూ. 30వేల ఆర్థికసాయం చేశారు.

బాలానగర్: మండల పరిధిలోని గుండేడ్, ఎక్వాయపల్లి గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పెద్దలు అమ్మవార్ల ఆలయాలను సుందరంగా అలంకరించగా.. డప్పులు, డీజేల సందడిలో బోనాలతో మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

నవాబుపేట: సాగులో ఖర్చులు సగం తగ్గించడంతో పాటు దిగుబడి సైతం అధికంగా ఇచ్చే నూతన వరి సాగు పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. సాగుపై శుక్రవారం లింగంపల్లి, కారూర్, కాకర్లపహడ్ గ్రామాల్లో క్షేత్ర స్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



లింగంపల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవాబుపేట: సైబర్‌నేరగాళ్ల వలలో పడకుండ జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం లింగంపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొబైల్ వినియోగం తగ్గించాలని అన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలన్నారు. పోలీసు సురక్ష బృందం పాటలు, నాటికలతో అలరించారు. సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చిన్నచింతకుంట: తిర్మలాపూరం గ్రామానికి చెందిన జరినాబేగం లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా సర్పంచ్ సత్యం దంపతులు శుక్రవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కురుమూర్తి, తిరుమల్, ఇమ్రాన్, రాము, అంజన్నలతోపాటు పలువురు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోయిల్‌కొండ: మల్కాపూర్‌లో శుక్రవారం వేముల వెంకటమ్మ(55) అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అదేగ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు చెల్లాపురం శ్రీధర్‌రెడ్డి అంత్యక్రియల కోసం రూ. 5వేలు బాధిత కుటుంబానికి అందించారు. సర్పంచ్ నారాయణ ఉన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాల్సిందే



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి వి.పద్మ

భూత్పూర్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని 9 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ అన్నారు. మండలకేంద్రంలో కార్మికుల సమ్మెకు శుక్రవారం మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి, మండల అధ్యక్షుడు మైబు, కార్యదర్శి నారాయణ కార్మికులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు శ్రీను నాయక్ అన్నారు. సమ్మె శుక్రవారం మాట్లాడారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బాలానగర్: గ్రామ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సమ్మెకు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు శ్రీను, చంద్రయ్య, గుడ్ల యాదయ్య తదితరులు ఉన్నారు.

మద్దతు పలికిన బీజేపీ

మిడ్జిల్: కార్మికుల సమ్మెకు శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ మద్దతు తెలిపారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు లాలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ వర్కర్ల సమ్మెను శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎగ్గని నర్సిములు, నియోజకవర్గ నాయకుడు దేవరకద్ర బాలన్నలు సందర్శించారు. రవీందర్‌రెడ్డి, గట్టు మల్లేష్, చెన్నగౌడ్, వేఘనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలో కార్మికుల సంఘం అధ్యక్షుడు పాశం నర్సిములు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శబీర్, సత్యమ్మ, రాములు, అంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

జడ్చర్ల: రోడ్డు దాటుతున్న మహిళను వాహనం ఢీకొని అక్కడికక్కడే మృత్యువాతపడిన ఘటన పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూర్ చెందిన కళావతి(45) కల్వకుర్తి నుంచి బస్సులో కొత్తబస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి లారీలో కర్నూల్ వెళ్లేందుకు జాతీయరహదారిపైకి చేరుకుంది. డివైడర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన కంచెను దాటి రోడ్డు దాటుతున్న సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న బోలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాగా మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చంద్రయాన్-3 ప్రయోగంపై హర్షం



కోయిల్‌కొండ: ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా శుక్రవారం మండలంలోని శ్రీవీరభద్ర పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. చంద్రయాన్- 3 ఆకృతిలో కూర్చొన్నారు. ప్రయోగం విజయవంతం కావడం గర్వకారణమని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: కొత్తపల్లి గ్రామ శివారులోని దుందుభీ వాగు నుంచి శుక్రవారం ఉదయం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని ఆర్సి తండాకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు.

పీఎస్‌ల పరిశీలన



గండీడ్: మండలంలోని వెన్నచేడ్, గోవింద్‌పల్లి, రంగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం వసతుల కల్పనపై ఈ సందర్భంగా ఆరా తీశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో శుక్రవారం బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే దళిత బంధు ఇస్తున్నారని, నిరుపేదలైన దళితులకు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు ఫారుఖ్, పట్నం శ్రీనివాస్, సదానంద్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

డ్రమ్‌సీడర్‌పై అవగాహన

రాజాపూర్: డ్రమ్‌సీడర్‌తో తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కుచ్చర్‌కల్‌లో రైతులకు అవగాహన కల్పించారు. గత సంవత్సరం కొందరు రైతులు పెట్టుబడి తగ్గించుకునేందుకు డ్రమ్‌సీడర్‌తో సాగు చేసి లాభాలు సాధించారని అన్నారు. ఏఈఓ శ్రీను రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



చిన్నచింతకుంట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తుపదార్థాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. చక్కగా చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. పాఠశాల, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ అనిల్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: అర్హులందరూ ఓటరు నమోదు చేసుకోవాలని మహబూబ్‌నగర్ ఆర్డీఓ అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్ కార్యాలయంలో ఓటరు నమోదుపై అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ బీఎల్‌ఓలకు ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్స్‌తో పాటు రెండు ఫొటోలు ఇవ్వాలని సూచించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.పార్థసారథి, గిర్దావర్లు చైతన్య, నర్సింగ్, జూనియర్ అసిస్టెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: ఉమ్మడి మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టబోవు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు మార్కెట్ యార్డులో సీసీ రోడ్లు, యార్డు శాశ్వత భవన నిర్మాణం, ఇతర సౌకర్యాలపై చర్చించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, డైరెక్టర్లు మల్లేష్ గౌడ్, కిషన్, శ్రీశైలం, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బాలానగర్: కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచేందుకు ముందుకు వస్తున్న వారికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్‌కి చెందిన హైమద్ పాషా, రాములు నాయక్‌లు కాంగ్రెస్‌ను వీడి పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. జెడ్పీటీసీ మోహన్ నాయక్, వైస్ ఎంపీపీ వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిబిరం

గండీడ్: సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సునీల్ తెలిపారు. కప్లాపూర్ గ్రామంలో శుక్రవారం రెండోరోజు మెడికల్ క్యాంపులో ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్లు అలివేలు, శాంతమ్మ పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం ఎర్రకుంట సమీపంలో హజ్రత్ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా 253వ ఉర్సు షరీఫ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రధానమైన గంధోత్సవ (సందల్ షరీఫ్) వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వీరన్నపేట మక్కా మసీద్ సమీపం నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహా ప్రార్థనలు చేశారు. రాత్రి 10 గంటలకు ఖవ్వాలి (భక్తిగీతాలు) చేపట్టారు. ఉర్సులో భాగంగా నేడు చిరాగా (దీపారాధన)తోపాటు ముషాయిరా (ఆలిండియా కవి సమ్మేళనం) కార్యక్రమం ఉంటుందని ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాష ఖాద్రీ హకం షరీఫ్ తెలిపారు. 16న ఫాతేహా-ఖత్మే ఖురాన్‌తో వేడుకలు ముగుస్తాయని వివరించారు. సయ్యద్ చందా హుస్సేనీ, వారిస్‌పాష ఖాద్రీ, జహంగీర్‌పాష ఖాద్రీ, బుర్హాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న మంత్రి

స్టేషన్ మహబూబ్‌నగర్: బర్హానే బాద్‌షా ఉర్సు వేడుకల్లో శుక్రవారం రాత్రి రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్మాణంలో ఉన్న దర్గా కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, దర్గా ముతవల్లీ గయాజ్‌పాషా ఖాద్రీ, షబ్బీర్, రాషెద్‌ఖాన్, షఫి, ఎం.ఎ.సమద్‌ఖాన్, మహ్మద్ అక్బర్, జావేద్‌బేగ్, ఎజాజ్ మిర్జా, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో భాగంగా గంధం ఊరేగింపు

సీఎం మనుమడు పాఠశాలను సందర్శించాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఉర్దూమీడియం పాఠశాలను కేసీఆర్ మనవడు హిమాన్షు సందర్శించాలని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే యం.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.80లక్షలు మంజూరైనప్పటికీ నిర్మాణం చేసేందుకు ఎవరు ముందుకు రావటం లేదని, మన ఊరు మన బడి కార్యక్రమం పేరుకు మిగిలిపోయిందన్నారు. శేరిలింగంపల్లిలో బాత్‌రూం లేదని కళ్లల్లో నీళ్లు తిరిగాయని హిమాన్షు అన్నారని ఓసారి ఈ పాఠశాలను సందర్శిస్తే అప్పుడైనా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

క్రైస్తవుల మౌనప్రదర్శన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మణిపూర్‌లో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో శుక్రవారం క్రైస్తవులు మౌన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. వందలామంది క్రైస్తవులు పాల్గొన్నారు. కల్వరి ఎంబీ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌరస్తా వరకు సాగింది. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా అక్కడి నుంచి తిరిగి ఎంబీసీ వరకు ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, చర్చిల కూల్చివేతలను ఆపాలని, దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కల్వరి ఎంబీ చైర్మన్, పాస్టర్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఐ జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టివెన్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.